సాక్షి పల్నాడు

ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



దుర్గమ్మ సేవలో గోపీచంద్

ఇంద్రకీలాద్రి: హీరో గోపీచంద్ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను శనివారం దర్శించుకున్నారు. తన సినిమా విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు చేయించారు.



భావనాఋషి కల్యాణ మహోత్సవాలు

తెనాలిటౌన్: భావనాఋషి స్వామివారి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 517.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.


ఆదరించి అందలమెక్కించారు


కాసు బ్రహ్మానందరెడ్డి


కాసు వెంకటకృష్ణారెడ్డి


కొణిజేటి రోశయ్య


నేదురుమల్లి జనార్ధనరెడ్డి


మేకపాటి రాజమోహన్‌రెడ్డి


మోదుగుల వేణుగోపాలరెడ్డి


రాయపాటి సాంబశివరావు

ఇప్పటి వరకు బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకున్నాయి రాష్ట్రంలోని ప్రధాన రాజకీయపార్టీలు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలు అంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు బ్యాక్ బోన్ అని నిరూపించారు. బీసీలకు పలు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి అధికారం కట్టబెట్టారు. జనరల్ స్థానాలను సైతం బీసీలకు కేటాయించారు. తాజాగా జరగబోయే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీసీలకు అత్యధిక స్థానాలను కేటాయించి వారిపట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

వైఎస్సార్ సీపీలో బీసీలకు పెద్దపీట

- నరసరావుపేట ఎంపీ టికెట్ బీసీ వర్గాలకే
- సమన్వయకర్తగా ఇప్పటికే బాధ్యతలు చేపట్టిన పి అనిల్‌కుమార్ యాదవ్
- పల్నాడు జిల్లాలో బీసీ సంఘాల ఆనందోత్సాహాలు
- అత్యధిక మెజార్టీతో గెలిపించి కానుకగా ఇస్తామంటూ ప్రతిన

సాక్షి, నరసరావుపేట/సత్తెనపల్లి: నరసరావుపేట లోక్‌సభ చరిత్రలో ఇప్పటి వరకు బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఎంపీగా ఎన్నికవ్వలేదు. సుమారు నలభై దాకా బీసీ ఉప కులాలు ఉన్న పల్నాడు ప్రాంతంలో ఎప్పుడూ అగ్ర వర్ణాలకు చెందిన వారే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ఒరవడిని మార్చి బీసీలకు ఈ ప్రాంతం నుంచి పార్లమెంట్‌లో స్థానం కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా నరసరావుపేట పార్లమెంట్‌కు మాజీ మంత్రి పి అనిల్‌కుమార్ యాదవ్‌ను సమన్వయకర్తగా నియమించడంతో బీసీ సంఘాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి. దీంతో రాబోయే ఎన్నికల్లో బీసీలంతా సమష్టిగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు కోసం పని చేస్తామని చెబుతున్నారు.

గతంలో గెలుపొందిన పార్లమెంట్ సభ్యులు	
1952	సి.రామయ్యచౌదరి
1967-76	మద్ది సుదర్శనం
1977-83	కాసు బ్రహ్మానందరెడ్డి
1984-89	కాటూరి నారాయణస్వామి
1989-95	కాసు వెంకటకృష్ణారెడ్డి
1996-98	కోట సైదయ్య
1998-99	కొణిజేటి రోశయ్య
1999-2004	నేదురుమల్లి జనార్ధనరెడ్డి
2004-2009	మేకపాటి రాజమోహనరెడ్డి
2009-2014	మోదుగుల వేణుగోపాలరెడ్డి
2014-2019	రాయపాటి సాంబశివరావు
2019-2024	లావు శ్రీకృష్ణదేవరాయలు

చరిత్రలో తొలిసారిగా....

1952 నుంచి 2019 వరకు 15సార్లు పార్లమెంట్ ఎన్నికలు జరిగినప్పటికీ ఏ రాజకీయపార్టీ కూడా బీసీలకు ప్రాతినిధ్యం కల్పించలేదు. ఇక్కడ నుంచి సి.రామయ్యచౌదరి, మద్ది సుదర్శనం, కాసు బ్రహ్మానందరెడ్డి, కాటూరి నారాయణస్వామి, కోట సైదయ్య, కాసు వెంకటకృష్ణారెడ్డి, కొణిజేటి రోశయ్య, నేదురుమల్లి జనార్దనరెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, రాయపాటి సాంబశివరావు లాంటి ఉద్దండులు ప్రాతినిధ్యం వహించారు. అలాంటి చారిత్రక నేపథ్యం ఉన్న నరసరావుపేట పార్లమెంటు స్థానాన్ని తొలిసారిగా బీసీలకు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని బీసీ సంఘాల నాయకులు చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో నరసరావుపేట పార్లమెంట్ నుంచి అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందిస్తామని సంబరాలు నిర్వహించారు. ఇటీవల నరసరావుపేటలో కార్యాలయం ప్రారంభోత్సవానికి పెద్ద ఎత్తున జనం తరలివచ్చి మద్దతు పలికారు.


అనిల్‌కుమార్ యాదవ్

గెలుపునకు సమష్టిగా కృషి చేస్తాం



నరసరావుపేట ఎంపీ సీటు బీసీలకు కేటాయించడం చాలా సంతోషం. నరసరావుపేట ఎంపీ అభ్యర్థితో పాటు ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా కృషి చేస్తాం.

– రాజవరపు శివనాగేశ్వరరావు, న్యాయవాది, శాలివాహన సంఘనేత, సత్తెనపల్లి

రాజ్యాధికారం దిశగా బీసీలు



బీసీలకు రాజ్యాధికారం అందించే దిశగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. రాష్ట్రంలోని బీసీలంతా సీఎంకు రుణపడి ఉంటారు. అన్నింటా బీసీలకు పెద్దపీట వేస్తున్నారు.

– ఎద్దులదొడ్డి కోటేశ్వరమ్మ, వాల్మీకి, బోయ కార్పొరేషన్ డైరెక్టర్, సత్తెనపల్లి

వడ్డెర సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ

రాష్ట్రంలో ఎన్నడూ వడ్డెర సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన దాఖలాలు లేవు. గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నంను శాసనమండలికి పంపారు. పల్నాడుకు చెందిన మరో బీసీ నేత జంగా కృష్ణమూర్తికి ఎమ్మెల్సీ ఇవ్వడంతోపాటు ప్రభుత్వ విప్‌గా సముచిత స్థానం కల్పించారు. గుంటూరు మార్కెట్ యార్డుకు చైర్మన్‌గా యాదవ సామాజిక వర్గానికి చెందిన నిమ్మకాయల రాజానారాయణకు అవకాశం కల్పించారు. స్థానిక సంస్థలు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్ పదవులను బీసీలకు కేటాయించారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి


సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

చిలకలూరిపేట: పేదలందరికీ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. పట్టణంలోని రాగన్నపాలెం, సుభానినగర్ సచివాలయాలను కలెక్టర్ శనివారం సందర్శించారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ జరుగుతున్న విధానాన్ని, సంబంధిత సాంకేతిక సమస్యలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా, లేదా అనే విషయంపై ఆరా తీశారు. సచివాలయానికి వచ్చిన మహిళలతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్న విధానం అడిగి తెలుసుకున్నారు. సచివాలయ పరిధిలో అందే సేవల గురించి అన్ని విభాగాల కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ప్లానింగ్ కార్యదర్శుల విధులు, క్షేత్రస్థాయిలో ఎదురౌతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బంగారుతల్లి, ఆరోగ్యశ్రీ కార్డులు, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాలకు సంబంధించిన సేవలపై ఆరా తీశారు. సచివాలయ పరిధిలో బాల్య వివాహాల విషయమై మహిళా పోలీసులతో చర్చించారు. బాల్య వివాహాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని, ఈ విషయమై అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులు, సచివాలయ పరిధిలో ఉన్న వలంటీర్ల మధ్య సమన్వయం చేసుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, తహసీల్దార్ జ్వాలా నరసింహం, ఎంపీడీవో శ్రీనివాసరావు, టీపీఎస్ కె సునీత తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఈనెల 29వ తేదీలోగా తమ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని ఏటీఓ మౌలాలి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మానం సుబ్బారావు, కార్యదర్శి సీసీ ఆదెయ్య శనివారం తెలిపారు. అలాగే పెన్షనర్ అసోసియేషన్ కార్యాలయంలో బయోమెట్రిక్, ఐరిష్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ అందించవచ్చని తెలిపారు. నరసరావుపేట ట్రెజరీ కార్యాలయం పరిధిలో 3231మంది పెన్షనర్లు ఉండగా, ఇప్పటి వరకు 2511 మంది మాత్రమే లైఫ్ సర్టిఫికెట్లు అందజేశారని వివరించారు.

విజయకీలాద్రిపై హయగ్రీవ హోమం



తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై 7వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం హయగ్రీవ హోమం నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పరిపూర్ణ మంగళశాసనాలతో త్రిదండి దేవనాథరామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో సకల కార్యసిద్ధికి హయగ్రీవ హోమం, పూర్ణాహుతి నిర్వహించామని, కలియుగ ప్రత్యక్ష దైవం, విజయకీలాద్రి వాసుడైన వేంకటేశ్వరస్వామిని ఉదయం హనుమద్ వాహనంపై, సాయంత్రం హంస వాహనంపై ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించామన్నారు.

21న తెలుగు పద్యాల పోటీలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థుల్లో తెలుగు భాషపై ఆసక్తి కలిగించేందుకు ఈ నెల 21న తమ కళాశాల తెలుగు విభాగం, ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం సంయుక్తంగా సిద్ధార్థ ఆడిటోరియంలో తెలుగు పద్యాల పోటీలు నిర్వహిస్తున్నాయని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో ఐదు నుంచి పదో తరగతి వరకు ఒక విభాగం, కళాశాల స్థాయిలో ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కళాశాల విద్యార్థులు మరొక విభాగంగా పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రవేశ రుసుం లేదని, ఆ రోజు ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోటీలు జరుగుతాయని వివరించారు. ప్రాచీన పద్య, శతక కవులు రాసిన రెండు తెలుగు పద్యాలను ఆలపించి, వాటి భావాన్ని వివరించాలని తెలిపారు. ప్రతి పాఠశాల, కళాశాల నుంచి గరిష్ఠంగా ఐదుగురు పాల్గొనవచ్చని సూచించారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు 83748 65621 నంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఏపీ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శనివారం ఎడ్యుకేషనల్ ఎపిఫని ఆధ్వర్యంలో నిర్వహించిన మెరిట్ టెస్ట్–2024లో రాష్ట్ర స్థాయి విజేతలుగా నిలిచినా విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని, సాంకేతికపరంగా అద్భుత ఆవిష్కరణలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువులో రాణిస్తూ, సైన్స్ అండ్ టెక్నాలజీలో ఏం మార్పులు వస్తున్నాయో ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఎడ్యుకేషనల్ ఎపిఫని సంస్థ మెరిట్ టెస్ట్ నిర్వహించి ట్రోఫీలు, నగదు బహుమతులు అందించడం హర్షణీయమన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ కన్వీనర్ రామచంద్రమూర్తి ఉన్నారు.

వలంటీర్లు... సేవా సైనికులు

- అవినీతి, వివక్షకు తావులేని సంక్షేమ వారధులు
- పేదల భవిష్యత్తు మార్చే యుద్ధంలో మీరు సిద్ధంగా ఉండాలి
- రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- అట్టహాసంగా 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం


అవార్డులు అందుకున్న వలంటీర్లతో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంస్కరణల సుపరిపాలనను, సంక్షేమ పథకాలను ఒక్క రూపాయి అవినీతి, వివక్ష లేకుండా నేరుగా ప్రజలకు అందిస్తున్న సేవా సైనికులు, సంక్షేమ వారధులు వలంటీర్లని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధుల్లా పనిచేస్తున్న వలంటీర్లను చూస్తే ప్రతిపక్షాలు భయపడుతున్నాయన్నారు. అందుకే స్వచ్ఛందంగా పనిచేస్తున్న వలంటీర్లపైన కూడా ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. మరో రెండు నెలలపాటు పేదల భవిష్యత్తు మార్చేందుకు మనమందరం చేస్తున్న యుద్ధంలో మీరు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల స్థాయిలో సేవా రత్న అవార్డుకు ఎంపికైన నందిగామ గ్రామానికి చెందిన వలంటీర్లు ఆశాజ్యోతి, చట్టు రేణుక, గుడిపూడి గ్రామానికి చెందిన అల్లం పోలేశ్వరి, అబ్బూరు గ్రామానికి చెందిన సయ్యద్ మొహిద్దీన్ బాష, ధూళిపాళ్ల గ్రామానికి చెందిన ఉదంతా లక్ష్మిలకు ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున రూ.1.50 లక్షల నగదు బహుమతిని, ప్రశంసాపత్రాన్ని అందించి సత్కరించారు. మండలంలో మిగిలిన 388 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున రూ.58.20 లక్షలు నగదు పురస్కారాన్ని అధికారులు పంపిణీ చేయనున్నారు. మండల వ్యాప్తంగా 404 మంది వలంటీర్లకు గాను రూ.59.70 లక్షలను ప్రభుత్వ ప్రోత్సాహంగా అందిస్తున్నామని ఎంపీడీఓ ఎస్.జగదీష్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ యలవర్తిపాటి జైబూన్‌బీ, సత్తెనపల్లి రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యుడు కళ్లం విజయభాస్కర్‌రెడ్డి, సంకటి శ్యామ్‌సన్, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలక జైపాల్ పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో సంక్షేమ వెల్లువ

- సీఎం వైఎస్ జగన్ పాలనలో 91 లక్షల మందికి రూ.30వేల కోట్ల లబ్ధి
- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చారని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. శనివారం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో హెనీ క్రిస్టినా మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్ సారథ్యంలో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే తిరిగి విజయదుందుభి మోగిస్తుందని అన్నారు. నాలుగేళ్ల 10 నెలల కాలంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 91 లక్షల మందికి రూ.30 వేల కోట్ల లబ్ధి చేకూరడం చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన విషయమన్నారు. అవినీతికి తావు లేకుండా డీబీటీ పద్ధతిలో లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమచేయడం ద్వారా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేశారని అన్నారు. లక్షల మందికి మేలు చేసిన ప్రభుత్వం దేశంలోనే ఎక్కడా లేదని స్పష్టం చేశారు.

- మనబడి నాడు–నేడు మొదటి దశలో ఉమ్మడి జిల్లాలోని 1,183 పాఠశాలలను రూ.229 కోట్లతో ఆధునీకరించడంతోపాటు 77 పీహెచ్‌సీ భవనాలను ఆధునీకరించినట్లు వివరించారు.
- వరికేపూడిశెల ప్రాజెక్టుకు రూ.340 కోట్లతో ఎత్తిపోతల పనులకు శంఖుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్ పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని 73 వేల ఎకరాల ఆయకట్టుతో పాటు బొల్లాపల్లి మండలానికి సాగు, తాగునీటి ఎద్దటి నివారణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.
- పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 660 ఎకరాల భూమి సేకరించి రూ.1240 కోట్ల ఖర్చుతో జగనన్నకాలనీ అభివృద్ధి చేసి మూడు లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందించారని వివరించారు.
- ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయనీ, ఇప్పటికే పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 111 సచివాలయ భవ నాలు, 138 రైతు భరోసా కేంద్రాలు, 96 వైఎస్ఆర్ క్లినిక్స్, రూ.627 కోట్లతో పూర్తిచేశారని చెప్పారు.
- 165 వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ భవనాలు నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని తెలిపారు.
- గుంటూరు చానల్ విస్తరణకు ఆమోద ముద్ర వేసిన ప్రభుత్వం, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని 48 వేల ఎకరాల కొత్త ఆయకట్టును వినియోగంలోకి తెస్తోందని అన్నారు.

నేడు మల్లేశ్వర స్వామికి కుంభాభిషేకం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ సహిత స్వర్ణ శిఖర కలశ స్థాపన, కుంభాభిషేకానికి దేవస్థాన వైదిక కమిటీ సుముహూర్తం ఖరారు చేసింది. ఆదివారం ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 12.06 గంటల మధ్య ఈ పూజా కార్యక్రమాలు పూర్తిచేయాలని నిర్ణయించింది. ఈ పూజా కార్యక్రమాలకు దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ హాజరుకానున్నారు. ఏర్పాట్లను శనివారం దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కె.ఎస్.రామారావు పరిశీలించారు.

పూజా కార్యక్రమాలు ఇలా..

మల్లేశ్వరస్వామి ఆలయ పున నిర్మాణం పూర్తి కావడంతో స్వామి దర్శనానికి దేవస్థాన అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం దేవతా మూర్తుల విగ్రహాలకు శయనావాసం, పూజా కార్యక్రమాలు, హోమాలను నిర్వహిస్తారు. యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించిన బాలాలయంలో పూజలు అందుకుంటున్న కలశాన్ని మల్లేశ్వరాలయానికి తీసుకొస్తారు.

టీడీపీ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలి

సమన్వయకర్త డాక్టర్ అనిల్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: పార్లమెంటు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం సాయంత్రం నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని మీడియాతో మాట్లాడారు. డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ మాచర్ల, గురజాల నియోజకవర్గాలకు చెందిన టీడీపీ ఇన్‌చార్జీలు తాను వచ్చిన రెండురోజుల వ్యవధిలోనే బీసీలకు అన్యాయం జరిగిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇటువంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని బీసీలు అందరినీ స్వయంగా కలుస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగతంగా జరిగే ఘర్షణలను పార్టీలకు పులిమి రాజకీయం చేయటం టీడీపీ నాయకులకు అలవాటుగా మారిందన్నారు. నియోజకవర్గం ప్రశాంతంగా ఉండాలని తాము కోరుకుంటున్నామన్నారు. అయినప్పటికీ పల్నాడులో జరిగిన చెదురుమదురు సంఘటనలు పార్టీలకు పులిమి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇది పద్ధతి కాదని హెచ్చరించారు.

బజరంగ్ ఆధ్వర్యంలో గుండె శస్త్ర చికిత్సలు


గుండె శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారిని పరామర్శిస్తున్న అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుండెకు శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారిని శనివారం ఫౌండేషన్ అధినేత అంబటి మురళీకృష్ణ పరామర్శించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. బజరంగ్ 'జగన్నామ సంక్షేమ సంగమం'లో భాగంగా ఇటీవల 'మీ గుండె పదిలం' కార్యక్రమంలో స్టంట్స్/సర్జరీలు నిర్ధారించగా బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడ్‌స్టార్ హాస్పిటల్ విజయవాడలో నారాకోడూరుకు చెందిన దానబోయిన పెంచలయ్య, మునిపల్లెకు చెందిన తుపాకుల నాగేశ్వరరావులకు గుండె సర్జరీ జరిగింది. గోళ్లమూడిపాడుకు చెందిన ఖగ్గా మాణిక్యం స్టంట్ వేయించుకున్నారు. వీరిని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ నారాకోడూరు, మునిపల్లె, గోళ్ళమూడిపాడు గ్రామాల్లోని ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. బజరంగ్ నేత్ర జ్యోతి కార్యక్రమంలో కళ్లజోళ్లు తీసుకున్న అనేకమంది గ్రామస్తులు మురళీకృష్ణను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

యరపతినేనిలో విశ్వసనీయత లేదు

- అక్రమ మైనింగ్ ద్వారా వేల కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించారు!
- అందుకే సీబీఐ విచారణ చేపట్టింది
- గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: టీడీపీ నేత యరపతినేని శ్రీనివాసరావుపై గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. స్థానిక నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో 2014 నుంచి 2019 వరకు అక్రమంగా మైనింగ్ చేసి పేకాట క్లబులు నడిపి వందల కోట్లు అక్రమంగా సంపాదించిన వ్యక్తి యరపతినేని అన్నారు. మాడుగులలో 2008 నుంచి అన్ని ప్రభుత్వ అనుమతులతో క్వార్ట్జ్ క్వారీ జరుగుతోందని ఎవరో చెప్పారని యరపతినేని అబద్దాలు చెప్పటం మంచి పద్ధతి కాదన్నారు. అక్రమ మైనింగ్‌లో డబ్బులు సంపాదించుకోవడం వల్లే యరపతినేనిపై టీడీపీ ప్రభుత్వం సీబీసీఐడీ విచారణ చేసి ఆ తరువాత సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిందని ఎమ్మెల్యే కాసు వివరించారు. మాడుగులలో హెల్త్ సెంటర్‌ని 1980లో కట్టించారని, 2014 జనవరిలో కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తే యరపతినేని వల్లే వచ్చినట్లుగా సిగ్గులేకుండా అబద్ధాలు చెబుతున్నాడన్నారు. మాడుగులలో ఒక్క ఇంటి పట్టా కూడా యరపతినేని ఇవ్వలేదని, తాము 440 మంది నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చామని, మాడుగలను మార్చేశామని చెబుతున్న యరపతినేని ఏమి మార్చావో బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే కాసు సవాల్ విసిరారు. ప్రజలకు యరపతినేని పట్ల విశ్వాసం లేదని, ఎన్నికల నేపథ్యంలో యరపతినేని బురద జల్లే ప్రయత్నాలు చేసిన ప్రజలు నమ్మరని ఎమ్మెల్యే కాసు చెప్పారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, వైస్ ఎంపీపీ కందుల జాను, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు వంగా పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

విద్యార్థులకు జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామరెడ్డి సూచన


మాట్లాడుతున్న పరంధామరెడ్డి

నరసరావుపేట: విద్యార్థులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ మిగిలిన వారికి ఆదర్శప్రాయంగా ఉండాలని జిల్లా రవాణాశాఖ అధికారి టి.కె.పరంధామరెడ్డి పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా శనివారం తిరుమల ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పరంధామ రెడ్డి మాట్లాడుతూ యువత ఎక్కువగా ప్రమాదాలకి గురవుతున్నారని, తగిన భద్రతా నిబంధనలు పాటించకపోవడమే దీనికి కారణమన్నారు.

చట్టాలు ఉన్నది ప్రజల రక్షణ కోసమేనని వాటిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని, నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం అత్యంత ప్రమాదకరమని ఆయన విద్యార్థులకు సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని అయన తెలిపారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రమాదాలు జరగడానికి గల పలు కారణాలను విద్యార్థులకు వివరించారు. వీడియో ప్రదర్శన ద్వారా మోటార్ వాహన చట్టంలోని నిబంధనలు, రెగ్యులేషన్స్ విద్యార్థులకు వివరించారు. సదస్సు లో తిరుమల కాలేజ్ ఈసీఇ విభాగాధిపతి జగదీశ్, ఎన్‌సీసీ ట్రెయినింగ్ అండ్ ప్లేస్‌మెంట్ హెడ్ సాంబశివరావు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు
- యల్లమంద హైస్కూలు సందర్శన


హైస్కూలులో క్లాసు రూం తనిఖీ చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు

నరసరావుపేట: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మంచి ఫలితాలను సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని యల్లమంద గ్రామంలో గల జిల్లా పరిషత్ హైస్కూలును ఆకస్మికంగా సందర్శించారు. స్కూలు పరిసరాలు, తరగతి గదులను పరిశీలించారు. పారిశుధ్య తీరుని పరిశీలించారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పదోతరగతి పరీక్షలపై సమీక్షించారు. పదో తరగతి విద్యార్థులు ఎలా చదివితే ఉన్నతమైన స్థానానికి వెళ్తారో తెలియచేశారు. ప్రభుత్వం విద్యకు 40 శాతం నిధులు ఖర్చు చేస్తూ ప్రతి విద్యార్థి ప్రభుత్వ బడిలో చదవాలనే ఆకాంక్షతో పనిచేస్తోందని గుర్తుచేశారు. విద్యార్థుల కోసం జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి, జగనన్న కానుక, నాడు–నేడు పథకాలు తెచ్చి ప్రతి పేద విద్యార్థి చదువుకోవాలని ఆలోచన చేసి అమలు చేస్తుందన్నారు. అంతేకాకుండా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, కమిషనర్ సురేష్ కుమార్, ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ స్వయంగా విద్యార్థులు భవిష్యత్ గురించి తగిన శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. నాడు నేడు పనులు, టోఫెల్ ప్రోగ్రాం తదితర అన్ని విషయాల గురించి చర్చించి సలహాలు సూచనలు చేశారు.

పెదకూరపాడు బీజేపీకి కేటాయించాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ బాబు

అమరావతి: బీజేపీతో పొత్తు కుదిరితే పెదకూరపాడు నియోజకవర్గం భారతీయ జనతా పార్టీకి కేటాయించాలని అధిష్టానికి సూచించామని పల్నాడు జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ బాబు అన్నారు. శనివారం అయన ఢిల్లీ నుంచి ఫోన్‌లో మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తన ఇతర రాజకీయ పార్టీలు స్థానికేతరులను అభ్యర్థులను పోటీకి దించే అవకాశం ఉందన్నారు. భారతీయ జనతాపార్టీ స్థానికుడినే అభ్యర్థి అనే నినాదంతో ప్రజల్లోకి వెళతామన్నారు. రాజధాని అభివృద్ధి చెందాలంటే కేంద్రప్రభుత్వ సహకారం ఎంతో అవసరమని అందుకే రాజధానిలో ప్రాధాన్యతగల పెదకూరపాడు నియోజకవర్గం బీజేపీకి కేటాయిస్తే రాజధాని మరింత త్వరితగతిన అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అలాగే పొత్తుకోసం జరిగే చర్చలలో పెదకూరపాడు అంశాన్ని తప్పక లేవనెత్తుతామన్నారు. భారతీయ జనతాపార్టీ పోటీ చేయడానికి తగిన కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు.. పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలు స్థానికులకే పట్టం కడతారని భారతీయ జనతా పార్టీ నమ్ముతుందన్నారు.